ఓటర్ స్లిప్పుల కోసం అగచాట్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల్లో ఓటర్ ఓటేసేందుకు తన పోలింగ్‌కేంద్రం లోకేషన్, క్రమ సంఖ్య, ఇతర వివరాలను తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం ఓటర్ స్లిప్పును అందజేస్తుంది. పోలింగ్‌కు వారం రోజుల ముందు నుండే అధికారులు స్లిప్పులను ఓటర్లకు పంపిణీ చేస్తుంటారు. అయితే ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని నగరంలో ఓటర్ స్లిప్పుల పంపిణీలో బూత్ లెవల్ ఆఫీసర్లు, ఎన్నికల అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఓటర్లకు స్లిప్పులు అందలేదు. దీంతో ఓటర్లు స్లిప్పుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ ప్రాంతంలోని అధికారులను ఓటర్ స్లిప్పుల కోసం సంప్రదించగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. స్లిప్పులు ఆన్‌లైన్ నుండి ఎలా పొందాలో తమకు తెలియదని, స్లిప్పులు ఇప్పించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. 3వ డివిజన్‌లోని జయనగర్ కాలనీ ప్రాంతంలో స్లిప్పులు రాక అధికారులకు ఫోన్‌లు చేస్తే తమకు సంబంధం లేదని సమాధానం చెబుతున్నారని వాపోయారు. బూత్‌లెవల్ ఆఫీసర్ల తీరుపై ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సర్వం సిద్ధం..

- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది
- ఉదయమే డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్దకు..
- పంపిణీ తీరును పర్యవేక్షించిన ఆర్‌ఓ గౌతమ్


పోలింగ్ విధుల్లో చేరేందుకు డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్దకు వచ్చిన సిబ్బంది

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్: ఖమ్మం లోక్‌సభ (పార్లమెంట్) ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. నేడు పోలింగ్ జరగనుండగా ఆదివారం ఖమ్మం, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ సామగ్రిని ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నెకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల నుంచి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ నుంచి సిబ్బంది ఆయా ప్రాంతాలమకు సామగ్రితో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

సెక్టార్లు ఇలా..

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గాన్ని 36 సెక్టార్లుగా విభజించగా 134 లోకేషన్లలో 355 పోలింగ్ కేంద్రాలున్నాయి. అదే విధంగా పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 29 సెక్టార్లలో 190 లోకేషన్లలో 290 పోలింగ్ కేంద్రాలున్నాయి. పొన్నెకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఒక వైపు ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ, మరొక పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి 1,560, పాలేరు నియోజకవర్గంకు 1,300 మంది ఎన్నికల విధులు నిర్వహిస్తుండగా అదనంగా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సకాల ఏర్పాట్లు..

ఆయా నియోజకవర్గాలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఉదయమే పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. సెక్టార్ల వారీగా పోలింగ్‌బూత్‌లకు సంబంధించిన టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ సకల సౌకర్యాలు కల్పించారు. పోలింగ్ సిబ్బంది కూర్చున్న వద్దకే ఎన్నికల సామగ్రి తీసుకొచ్చారు. వారికి పోలింగ్ బూత్‌ల వద్ద అవసరమైన అన్ని సామగ్రి అందించారు. సిబ్బంది అన్ని రకాలు సరి చూసుకున్న తర్వాతే పోలింగ్ కేంద్రాలకు మధ్యాహ్నం నుంచి బస్సుల్లో వెళ్లారు.

ఆర్‌ఓ, సీపీ సందర్శన..

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్‌లు సందర్శించారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు సౌకర్యాలు కల్పించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్స్ వద్ద కూడా టెంట్లు, కూలర్లు తదితర సౌకర్యాలు కల్పించారు.

ఆరోసారి పోలింగ్ విధులకు..



నేను ఆరోసారి ఎన్నికల విధులకు హాజరవుతున్నాను. 2000 సంవత్సరం ఉంచి ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనటం మంచిగా అన్పించింది. నాటి సౌకర్యాలకు ప్రస్తుత సౌకర్యాలకు ఏ మాత్రం పొంతన లేదు.

-పగిడిపల్లి వెంకటేశ్వరరావు, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, ఖమ్మం

సౌకర్యాలు మంచిగా ఉంటున్నాయి



ఒకప్పుడు పోలింగ్ విధులంటే భయం అన్పించేది. నేను నాలుగు సార్లుగా ఎన్నికల విధులకు హాజరవుతున్నాను. గతంలో ఎన్నికల విధులకు వెళ్లాలంటే అక్కడ సరైన సౌకర్యాలు ఉండేవి కావు. మారుతున్న పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తున్న క్రమంలో విధులకు వెళ్లాలంటే ఇబ్బంది అన్పించటంలేదు. - వి.ఉమాదేవి, ఉపాధ్యాయురాలు

మారుతున్న కాలానికి అనుగుణంగా..



మారుతున్న కాలానికి అనుగుణంగా శిక్షణలో సైతం మార్పులు వచ్చాయి. ఇటీవల కాలం నుంచి పీఓలతో పాటు ఏపీవో, ఓపీఓలకు సైతం శిక్షణనిస్తున్నారు. దీని ద్వారా ఎన్నికల విధులను సులభంగా నిర్వహించే అవకాశం ఉంది. మూడుసార్లు ఎన్నికల విధులు నిర్వహించాను.

- జి.రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయుడు.

ఓటింగ్ శాతం పెంచేలా..

- ఖమ్మం నగరంలో మూడు ఆదర్శ పోలింగ్ కేంద్రాలు


ఆదర్శ పోలింగ్‌కేంద్రంలో సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ సోమవారం జరగనుండగా.. ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఓటర్లకు పలు రూపాల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించగా.. పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు పోలింగ్ స్టేషన్లను ఆదర్శ పోలింగ్ స్టేషన్లుగా అధికారులు తీర్చిదిద్దారు. మహిళలు, దివ్యాంగులకు, యువత కోసం మూడు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. మహిళల కోసం ఎన్ఎస్‌పీ క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 110 పోలింగ్ స్టేషన్‌ను, దివ్యాంగుల కోసం రాజేందర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 317 పోలింగ్ స్టేషన్‌ను, యువత కోసం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలోని 156 పోలింగ్ స్టేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు.

నియోజకవర్గంలో 3,24,073 మంది ఓటర్లు..

ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికలకు ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో 3,24,073 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. వీరిలో పురుషులు 1,55,284 మంది, మహిళలు 1,68,740 మంది, థర్డ్ జండర్ 49 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతేడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో 3,22,996 మంది ఓటర్లుకు గాను 2,36,304 మంది ఓట్లు వేశారు. ఈ ఎన్నికల్లో లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరింత పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆరు రూట్లు.. 312 మంది సిబ్బంది..


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: ఖమ్మం పార్లమెంట్‌కు సోమవారం జరగనున్న పోలింగ్‌కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మండలంలోని మొత్తం 59 పోలింగ్ కేంద్రాలున్నాయి. పోలింగ్‌కు అవసరమైన సిబ్బంది 312 మందిని ఏర్పాటు చేశారు. వీటి కోసం ఆరు రూట్ల ను ఏర్పాటు చేశారు. సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని 14 బస్సులతో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి పీఓ, ఏపీఓ, ఓపీఓ, పీ.సీ, మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు. మండలంలోని ముజ్జుగూడెం, గువ్వలగూడెంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఈ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు. 32 పంచాయతీలలో వయోవృద్ధులు, దివ్యాంగులను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 34 ఉచిత ఆటోలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలను పూర్తి చేశారు. ఈ మేరకు ఏర్పాట్లును మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, ఎంపీడీఓ యం.యర్రయ్య ఆదివారం పరిశీలించారు.


క్యూలైన్‌లో ఓటర్లు వెళ్లే విధంగా ఏర్పాట్లు

రఘునాథపాలెం: మండలంలోని 54 పోలింగ్ కేంద్రాల్లో సకల సౌకర్యాలతో ఏర్పాట్లు చేసి సర్వంసిద్ధం చేశారు. ఓటర్లు క్యూ లైన్‌లో పోయే విధంగా ఆరుబయట నిలబడిన ఎండప్రభావం పడకుండా టెంట్లు ఏర్పాటు చేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. మొత్తం పోలింగ్ కేంద్రాలకు ఐదు రూట్లలో ఆయా పోలింగ్‌బూతులకు సిబ్బంది ఈవీఎంలతో చేరుకున్నారు. మండలంలో 54 పోలింగ్ బూతుల పరిధిలో మొత్తం 40 వేల 57 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 120 మంది పైగా పోలీసులు ఖమ్మం టౌన్ ఏసీపీ పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగుతుంది.


కామేపల్లి: పోలింగ్ కేంద్రం వద్ద స్వాగత తోరణం

కామేపల్లి: లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మండలంలో 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 35,159 మంది ఓటర్లు ఉండగా వీరిలో 17,252 మంది పురుషులు, 17,907 మంది స్త్రీలున్నారని తెలిపారు. కామేపల్లి హైస్కూల్‌ను ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఓటర్లకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సాయంత్రం పోలింగ్ సామగ్రినితో సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు.


అజ్మీరతండా పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధులకు హాజరైన పోలీస్ సిబ్బంది

తిరుమలాయపాలెం: ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ పీవీ.రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలోని 64 పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ జరుగుతుందని తెలిపారు. విధులలో పాల్గొనే సిబ్బంది ఆయా పోలింగ్ బూత్‌లకు చేరుకుని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండలంలో 50,058 మంది ఓటర్లు ఉండగా 24,192 మంది పురుషులు, 25,866 మంది స్త్రీలు ఉన్నారు. ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో పాటు ఏసీపీ సుశీల్‌సింగ్ సీఐలు వినోద్, జనార్ధన్ పోలీసు సిబ్బంది విధులలో బందోబస్తు నిర్వహిస్తారని ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

ఎంపీ వద్దిరాజుకు సన్మానం..


ఎంపీని సత్కరిస్తున్న అసోసియేషన్

ఖమ్మంమయూరిసెంటర్: ఎంపీ వద్దిరాజు రవిచంద్రను పవర్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఖమ్మం బురహాన్‌పురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రవిచంద్రను అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఖమ్మం జిల్లా కార్యదర్శి మనోజ్ కుమార్, సభ్యులు రాపర్తి రాజా, బోయిన కార్తీక్, బాలు నాయుడు, నగీనా తదితరులు ఆదివారం కలిసి శాలువాలతో సన్మానించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం ఎదురుగా ఉన్న 'క్లాసిక్ జిమ్' పక్షాన కలిసిన వీరిలో బాలు నాయుడు, బోయిన కార్తీక్ ఉన్నారు. రాపర్తి రాజా ఆధ్వర్యంలో జూన్ 2న ఖమ్మంలోని టీఎన్జీవో భవన్ ప్రాంగణంలో జరిగే పవర్ వెయిట్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలకు ఎంపీ వద్దిరాజును ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా వారు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు.

పరామర్శ..

ఎంపీ వద్దిరాజు పాల్వంచ రాజేష్‌ను ఎంపీ, ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌లు పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేష్‌ను వారు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

పోలింగ్‌ను పెంచేలా కృషి చేయాలి

నేలకొండపల్లి: పోలింగ్‌ను పెంచే విధంగా సీపీఐ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు కాశిబోయిన అయోధ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడగా నాయకురాలు కె.భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వమే శ్రీరామరక్ష


మాట్లాడుతున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

కామేపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తూ ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాతలింగాల గ్రామంలో మండలంలోని పండితాపురం, కొత్తలింగాల, బండిపాడు తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. పేదల సంక్షేమానికి పాటుపడుతున్న రాహుల్‌గాంధీ పీఎం కావాలని ప్రజలంతా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గుజ్జర్లపూడి రాంబాబు, ధనియాకుల హన్మంతరావు, బైరెడ్డి యుగేంధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కొమ్మినేని శ్రీనివాసరావు, ఉప్పుగండ్ల వీరభద్రరావు, చల్లా హరి, దొడ్డ మల్లేస్, బానోత్ రాములు, శంకర్, ధరావత్ విన్నిబాబు, ప్రేమ్‌కుమార్, గొడుగు కొరివిలు, వీరన్న, దొడ్డ రవి, బాల పాల్గొన్నారు.

నవగ్రహ శాంతిహోమం


అయ్యప్ప ఆలయంలో నవగ్రహ శాంతి హోమం చేస్తున్న పూజారులు

ఖమ్మంగాంధీచౌక్: గ్రహదోష నివారణను కాంక్షిస్తూ సకల శుభాలు కలిగే విధంగా ఖమ్మం నగరంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న శ్రీ శాస్తా దేవస్థానంలో ఆదివారం నవగ్రహ శాంతిహోమం నిర్వహించారు. దేవస్థానం 38వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కేరళకు చెందిన తాంత్రులు, పూజారులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిల్లంచర్ల రాధాకృష్ణ, కార్యదర్శి రాయపూడి వెంకటరమణ, కోశాధికారి పసుమర్తి రంగారావు తదితరులు పాల్గొని పూజలు చేశారు.

మోదీ ప్రధానిగా ఉంటేనే అభివృద్ధి


మాట్లాడుతున్న అజ్మీరా సీతారాంనాయక్

కామేపల్లి: ప్రధానిగా మోదీ ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో ఆయన మాట్లాడారు.. సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమని, ప్రతీ కార్యకర్త పోలింగ్ ప్రారంభం నుంచి ముగిస్తే వరకు సైనికుడిలా పని చేయాలన్నారు. ఈ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయఢంకా మోగించడం, కాంగ్రెస్ పార్టీ దుకాణం బంద్ కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జర్పుల రామారావు, నాయకులు అజ్మీరా హరినాయక్, పుచ్చకాయల సత్యనారాయణ, తెల్లబోయిన సురేష్ పాల్గొన్నారు.

కబ్జా అవుతున్న స్థలాన్ని కాపాడండి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కాల్వొడ్డు ప్రాంతంలో ఉన్న సొందేషాహిద్ దర్గా శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, దానిని పరిరక్షించాలని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహమ్మద్ సలాం అధికారులను కోరారు. ఆదివారం ఇనాసఫ్ కమిటీ ఆధ్వర్యంలో స్థలంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 8, 87, 88, 89, 90లలో భూమిని కబ్జా చేసినా అధికారులు, పాలకులు పట్టించుకోలేదని, చివరకు శ్మశాన వాటిక స్థలంను కబ్జా చేస్తున్నా అడ్డుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రెహమాన్, చానా, అహ్మద్ షరీఫ్, ముజెమ్మిల్, రెహమాన్, పాషా పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమాలతోనే న్యాయం


మాట్లాడుతున్న ప్రబంజన యాదవ్

ఖమ్మం మామిళ్లగూడెం: సామాజిక ఉద్యమాలు, పోరాటాలతోనే సమస్యలకు న్యాయం జరుగుతుందని ప్రొఫెసర్ ప్రబంజన యాదవ్ అన్నారు. వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన 'సామాజిక న్యాయ సాధనలో మహిళలపాత్ర' కీలకం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో మహిళల పాత్ర కీలకమన్నారు. వీరనారి మణుల ఆశయ సాధన సమితి గౌరవ అధ్యక్షురాలు షేక్ నజీమా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్ ఆయేషాసుల్తానా, డాక్టర్ కేవి.కృష్ణారావు, నాగయ్య, ఉపేంద్రబాయి, జ్యోతి, కృష్ణవేణి, నాగలక్ష్మి, కల్పన, స్వరూపరాణి, లలిత, ఝాన్సీ, రాణి, నాయకులు భద్రూనాయక్, అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి లీగల్ సెల్ ధన్యవాదాలు

ఖమ్మం లీగల్: తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదులు అందరికీ రూ.100 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి ఖమ్మం లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలిపారు. ధన్యవాదాలు తెలిపిన వారిలో జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నివాళి..

ఖమ్మం మామిళ్లగూడెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టి.నర్సింహరావు మృతదేహాన్ని దళితరత్న అవార్డు గ్రహీత, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు సైదులు, రాజేష్, వెంకటేశ్వర్లు, కృష్ణ, నాగేశ్వరరావు, హరీష్‌రాజు, రామచంద్రయ్య ఉన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం


దేవాలయంలో ఒకే కుటుంబానికి చెందిన అమ్మలు

ఖమ్మంగాంధీచౌక్: మాతృ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. నగరంలో కార్తికేయ ఈవెంట్స్ ఆర్గనైజర్ ముత్తాడి శోభారెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్‌లో మాతృ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ క్యాంప కార్యాలయ ఇన్‌చార్జ్ తంబూరి దయాకర్ రెడ్డి, ఖమ్మం న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ హైమావతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్టిస్టులు తమ కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా 'బెస్ట్ మదర్ ఫర్ ఎవర్' పేరిట పలువురు అమ్మలకు మెడల్స్‌ను అందించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారి అమ్మలను సత్కరించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	క్రిష్ణమ్మ
వినోద	బాక్, టిల్లు^{2}
సాయిరాం	కింగ్‌డమ్ ప్లానెట్
	ఆఫ్ ద యాప్
ఆదిత్య	ప్రతినిధి 2
శ్రీనివాస	ఆ.. ఒక్కటీ అడక్కు

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	34	బచ్చలికూర	5
వంకాయ	26		20
బెండకాయ	56	పాలకూర	2
పచ్చిమిర్చి	70		10
కాకర	66	చుక్కకూర	2
బీర	46		10
దొండ	40	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	90	గోంగూర	2
గోరుచిక్కుడు	50		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	36		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	50	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

ఎన్నికల సామగ్రితో తరలిన సిబ్బంది..


ఎన్నికల సామగ్రితో పోలింగ్ బూత్‌లకు బయలుదేరిన సిబ్బంది


పోలింగ్ విధులకు వెళ్తున్న మహిళా ఉద్యోగులు


సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది


ఈవీఎంల పనితీరును పరిశీలిస్తూ..


భోజనం చేస్తున్న సిబ్బంది


దూర ప్రాంతాలకు ఎన్నికల సామగ్రి, సిబ్బందితో బయలుదేరిన బస్సులు


బస్సులో వెళ్తున్న సిబ్బంది


ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు